సాక్షి చిత్తూరు

మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



అధిక ధరకు అమ్మితే చర్యలు

గ్యాస్ సిలిండర్లను అధిక ధరకు అమ్మితే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ విద్యాధరి హెచ్చరించారు. - 8లో



వైభవం.. ధ్వజారోహణం

బంగారుపాళెం మండలం మొగిలిలోని మొగిలీశ్వరస్వామి ఆలయంలో వైభవంగా ధ్వజారోహణం నిర్వహించారు. - 8లో



రావణబ్రహ్మపై శివయ్యరాజసం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వైభవంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మహాశివరాత్రిని పురస్కరించుకుని చిత్తూరు ఆర్టీసీ-2 డిపో నుంచి పలు ఆలయాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డీపీటీఓ జగదీష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అలాగే సిద్ధేశ్వరస్వామి కొండ, మరకతవల్లి సమేత స్వయంభు శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయాలకు పెనుమూరు, పచ్చికాపల్లం నుంచి ప్రత్యేక సర్వీసులు ఉంటాయని వెల్లడించారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

స్టోర్స్ భవనానికి భూమి పూజ



భూమిపూజలో ఎస్ఈలు సురేంద్రనాయుడు, ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా స్టోర్స్ భవనానికి సోమవారం భూమి పూజ చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. ఈ క్రమంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్ఈలు సురేంద్రనాయుడు, ఇస్మాయిల్ అహ్మద్ మాట్లాడుతూ రూ.45 లక్షల వ్యయంతో నూతన భవనం నిర్మించనున్నట్లు వెల్లడించారు. అలాగే చిత్తూరులో రూ.47లక్షలతో నిర్మిస్తున్న ఎస్ఈ కార్యాలయ భవనం పనులు శరవేగంగా సాగుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, వాసవీలత, శ్రీనివాసులు, డీఈలు వసంతనాయుడు, ఆనంద్, ఏఈలు మోహన్‌రావు, జనార్ధన్‌నాయుడు పాల్గొన్నారు.

వర్మీకంపోస్ట్‌తో భూసారం



వర్మీకంపోస్టు అందిస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : వర్మీకంపోస్ట్‌తో భూసారం పెరుగుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వర్మీకంపోస్ట్ స్టాల్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్మీ కంపోస్ట్‌తో మట్టికి మంచి పోషకాలు లభిస్తాయన్నారు. దీంతో పంట దిగుబడి పెరుగుతుందని వెల్లడించారు. పర్యావరణహితమైన వర్మీకంపోస్టును రైతులు విరివిరిగా వినియోగించుకోవాలని సూచించారు. సేంద్రియ విధానంపై ఆసక్తిగలవారు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లోని స్టాల్‌కు వచ్చి నాణ్యమైన వర్మీకంపోస్టు పొందవచ్చని చెప్పారు. రైతులు రసాయన ఎరువులపై ఆధారపడకుండా సహజసిద్ధమైన వర్మీకంపోస్ట్ వాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీపీఓ సుధాకర్‌రావు, డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ షణ్ముగం పాల్గొన్నారు.

1న జిల్లాకు ముఖ్యమంత్రి రాక

చిత్తూరు కలెక్టరేట్ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్చి 1వ తేదీన జిల్లాకు రానున్నట్లు కలెక్టరేట్ అధికారులు సోమవారం వెల్లడించారు. గంగాధరనెల్లూరులో చేపట్టే పింఛన్ల పంపిణీలో సీఎం పాల్గొనన్నుట్లు తెలిపారు. ఈ మేరకు పకడ్బందీ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

కాసుల దారి!

రహదారుల నిర్మాణ పనులను కూటమి నేతలు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ప్రజావసరాలతో పనిలేకుండా ఇష్టారాజ్యంగా రోడ్లు వేసి కాసులు దండుకుంటున్నారు. స్వార్థప్రయోజనాలే లక్ష్యంగా ఎక్కడ పడితే అక్కడ తూతూమంత్రంగా దారులు వేసి జనం సొమ్మును లూటీ చేసేస్తున్నారు. ఈ క్రమంలోనే అడిగిందే తడవుగా తమ్ముళ్ల అతిథిగృహాలకు రహదారులు వేసేశారు. తమ పార్టీ నాయకుడిని సంతృప్తి పరిచేందుకు ఒక్క ఇంటి కోసం అందంగా సీసీ రోడ్డు నిర్మించేశారు. అధికారమే అండగా నిబంధనలను తుంగలో తొక్కి యథేచ్ఛగా జేబులు నింపేసుకున్నారు. కూటమి నేతల బరితెగింపును అడ్డుకునే ధైర్యం చేయలేక ఉన్నతాధికారులు సైతం మిన్నకుండిపోయారు.



అప్పయ్యగారిపల్లెలో రోడ్డు (అనుమతిలేదు)



అయ్యప్పగారిపల్లెలో అనుమతి లేకపోయినా వేసిన రోడ్డు

చిత్తూరు మండలంలో అక్రమార్జనకు రాచ'బాట'

- నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు
- అవసరం లేని చోట్ల సీసీ రోడ్ల నిర్మాణం
- యథేచ్ఛగా ప్రజాధనం లూటీ చేస్తున్న కూటమి నేతలు
- వైఎస్సార్‌సీపీకి అనుకూలమైన ప్రాంతాలపై చిన్నచూపు
- చూసీచూడనట్టు వ్యవహరించిన అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం):

- చిత్తూరు మండలం కుర్చివేడు పంచాయతీ వీఎస్ పురం గ్రామంలో ఉన్న సిమెంట్ రోడ్డుపై మళ్లీ రోడ్డు వేశారు. గతంలో ఉన్న రోడ్డుకు అక్కడక్కడా గతకులుగా ఉండేదని సాకుగా చూపి సిమెంట్ రోడ్డుపైనే మళ్లీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గతంలో వేసిన సిమెంట్‌ను జేసీబీలతో తొలగించారు. ఊరు మొత్తం నాలుగు వీధులు.. రెండు పొడవాటి దారులకు రోడ్డు నిర్మాణం చేశారు. మొత్తం 600 మీటర్లు కాగా ఇందుకు రూ. 25 లక్షల వరకు వ్యయం చేశారు.
- తుమ్మిందలో గ్రామంలోని ఓ కూటమి నేతకు ఊరికి దగ్గరగా మామిడి తోట ఉంది. ఈ విశాలమైన మామిడి తోటలో ఓ గెస్ట్‌హౌస్ కూడా ఉంది. ఆయనకు ఊళ్లో ఇళ్లు ఉన్నా పొలం పనులు, ఇతర అవసరాల కోసం అక్కడ గెస్ట్ హౌస్ కట్టుకున్నారు. ఈ హౌస్‌కు కూడా సీసీ రోడ్డు వేశారు. 88 మీటర్లకు గాను రూ. 4 లక్షలు వ్యయం చేశారు. దీనిపై గ్రామస్తులు విమర్శలు గుప్పిస్తున్నారు.
- తుమ్మింద దళితవాడ వైఎస్సార్‌సీపీకి అనుకూలమని చిన్నచూపు చూశారు. కాలనీలో రోడ్డు అవసరం ఉన్నా రోడ్డు వేయలేదు. దీంతో కాలనీ బాటరోడ్డు పై పిచ్చిమొక్కలు ఏపుగా మొలిచాయి. సరైనా రోడ్డు మార్గం లేదు. దీంతో ఆ కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. వీటిని లెక్క చేయకుండా మామిడి తోటలోని గెస్ట్ హౌస్, ఒకే ఒక ఇంటికి, చెరువు కట్టలపై రోడ్డు వేశారని పల్లెవాసులు మండి పడుతున్నారు.
- తాళంబేడులో గ్రామంలోని ఓ బీడు భూమిలో శ్మశానం పేరు చెప్పి కిలో మీటర్ మేర రోడ్డు నిర్మించారు. ఇందుకు రూ. 7 లక్షల వరకు వ్యయం చేశారు. కానీ ఈ రోడ్డు ప్రభుత్వ ధనాన్ని లూటీ చేయడానికే వేసుకున్నారని గ్రామస్తులు చెబుతున్నారు.
- దిగువమాసాపల్లి పంచాయతీలో కూటమి నేతల వర్గపోరుతో ఇష్టానుసారంగా పనులు జరుగుతున్నాయి. ఆ వర్గం రోడ్డు వేస్తుందని..మరో వర్గం ఎలాంటి అనుమతి లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టింది. ఇంటి గుమ్మాన్ని కూడా వదలకుండా రోడ్డు నిర్మాణం చేపట్టింది. అప్పయ్యగారిపల్లి అనుమతి లేకుండా ఇళ్ల ముందు సిమెంట్ రోడ్డు వేసి వదిలేశారు. దిగువ కండ్రిగలో పక్క రోడ్డు చూపించి ఓ ఇంటి ముందు రోడ్డు వేశారు. దీనిపై బిల్లులు పెట్టించాలని కూటమి నేతలు ఒత్తిడి తెస్తున్నారు. కలెక్టర్‌కు సైతం ఫిర్యాదులు వెళ్లాయి.

సీసీరోడ్ల పేరుతో కూటమి నేతలు రోడ్లు మేసి కాసులు దోచేస్తున్నారు. ఇష్టానుసారంగా రోడ్ల నిర్మాణం సాగిస్తున్నారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పట్టించుకోలేదు. కొన్ని చోట్ల సిమెంట్ రోడ్లపైనే రోడ్డు వేసి దోచుకున్నారు. మరికొన్ని చోట్ల అవసరం లేకున్నా రోడ్లు వేసి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారు. కూటమి నేతల గెస్ట్ హౌస్‌లకు సైతం రోడ్లు పడుతున్నాయి. పొలాల్లో ఒకే ఒక ఇంటికి రోడ్లు వేసుకున్నారు. వైఎస్సార్‌సీపీకి అనుకూలమైన ప్రాంతాలపై చిన్నచూపు చూస్తున్నారు. దీంతో గ్రామజనం భగ్గుమంటోంది.

చిత్తూరు మండలంలో 17 పంచాయతీలు 117 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నేతల బాగోగుల కోసం సీసీ రోడ్ల నిర్మాణ పనులు జోరుగా మంజూరయ్యాయి. మొత్తం 73 పనులు..8,477 మీటర్లకు గాను రూ.3.56 కోట్లు కేటాయించారు. ఇందులో ఇప్పటి వరకు 46 పనులు..3,530 మీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. ఇందుకు గాను రూ.2 కోట్లకుపైగా వ్యయం చేశారు. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు కూటమి నేతలు గబగబా రోడ్లు వేస్తున్నారు.

మండల వివరాలు..

సచివాలయాల సంఖ్య	09
పంచాయతీలు	17
గ్రామాలు	117
మంజూరైనా పనులు	73
మంజూరైనా మీటర్లు	8,477
నిధుల కేటాయింపు	రూ.3.56 కోట్లు
ఇప్పటి వరకు పూర్తయిన పనులు	46..మీటర్లల్లో 3,530
చేపట్టాల్సిన పనులు	27
ఇష్టానుసారంగా చేసిన పనుల సంఖ్య	15 (చెరువు ప్రాంతం, కట్టప్రాంతం, మామిడితోటలు, ఇతరా)
రోడ్లపైనే రోడ్లు వేసిన సంఖ్య	04
అనుమతి లేకుండా వేసిన రోడ్లు	03
నాసిరకంగా ఉన్న రోడ్లు	04
బిల్లు చెల్లింపులు	రూ. ఒక కోటి
చెల్లించాల్సిన బిల్లులు	రూ.1.20 కోట్లు
పనులు దక్కించుకున్న కూటమినేతల సంఖ్య	48 మంది(సుమారు)

నాణ్యతకు పాతర..

సీసీ రోడ్ల నిర్మాణంలో కనీస ప్రమాణాలు పాటించాలనే నిబంధన ఉంది. అయితే అందుకు విరుద్ధగా రోడ్డు నిర్మాణాలు సాగుతున్నాయి. గతంలో రోడ్లు వేస్తే కింద పట్టా, రోడ్డుకు మధ్య భాగంలో అక్కడక్కడా బెర్మలు అమర్చేవారు. ఎండ కాలంలో సిమెంట్ రోడ్లు కూడా సాగుతాయని..ఇలా చేస్తే రోడ్లు తొందరగా పాడవ్వకుండా ఉంటాయని అధికారులు అంటున్నారు. ఇప్పుడు ఆ పట్టాలు, బెర్మలు ఎక్కడా కనిపించ లేదు. రోడ్డుకు మధ్యలో అక్కడక్కడ మిషన్‌తో సన్నటి గీతలు చేస్తున్నారు. అది కూడా పైపైకే జరుగుతున్నాయి. ఆ గీతలో తారు పోసేస్తున్నారు. ఇక రోడ్డు వేసే సమయంలో సిమెంట్, ఇసుక, కంకరను 1:2:4 నిష్పత్తిలో వినియోగించాలి. అంటే బస్తా సిమెంట్‌కు రెండు బస్తాల ఇసుక, నాలుగు తట్టల నల్లకంకర వేయాలి. కానీ పనులు జరిగిన చోట పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. సిమెంట్ కాంక్రీట్ మిశ్రమంలో నిబంధనలు పాటించడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇసుక, కంకరను ఎక్కువగా వినియోగిస్తూ..సిమెంట్‌ను నామమాత్రంగా వినియోగించినట్లు తెలుస్తోంది. దీంతో పాటు చాలా చోట్ల కల్తీ సిమెంట్ (బూడిద కలిపిన సిమెంట్) వాడుతున్నారు. ఇదీ తక్కువ రేటుకు వస్తుందని... అధిక మొత్తంలో ఇలాంటి సిమెంట్‌ను వాడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో కాంట్రాక్టర్లుగా అవతారమెత్తిన కూటమి నేతలకు కాసులు కురిపిస్తున్నాయి.

ఇష్టానుసారంగా పనులు..

రోడ్లు మంజూరైన నెలల వ్యవధిలోనే నిర్మాణ పనులు పూర్తి చేసుకుంటూ వస్తున్నారు. ఇప్పటికే మండలంలో దాదాపు 50 శాతం వరకు పనులు పూర్తయ్యాయి. అయితే ఆవేసిన రోడ్లను పలుచోట్ల పరిశీలిస్తే..ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. నేతల స్వార్థం కోసమే రోడ్లు వేశారు. కూటమినేతే కాంట్రాక్టర్‌గా అవతారమెత్తి అతని గెస్ట్‌హౌస్‌కు రోడ్డు వేసుకున్నారు. పెద్దిశెట్టిపల్లి పంచాయతీ దిగువూరు ప్రాంతంలోని వ్యవసాయ పొలంలో ఉన్న ఒకే ఒక ఇంటికి రోడ్డు వేశారు. ఈ గ్రామం నుంచి అటవీ ప్రాంతానికి వెళ్లే మార్గంలో ఇష్టానుసారంగా రోడ్లు వేశారు. తుమ్మిందలో చెరువు కట్టపై రోడ్డు వేశారు. చెరువు కట్టపై సీసీ రోడ్డు వేసేందుకు ఎలాంటి అనుమతులు లేవని, ఈ రోడ్డు ఎలా వేస్తారని కొంత మంది అధికారులు చెబుతున్నారు. కుర్చివేడులో రోడ్డు నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా జరిగినట్లు అంటున్నారు. ఇలా పలుచోట్ల విచ్చలవిడిగా రోడ్లు వేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని పల్లె ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యాప్‌లో ఫొటోలు తొలగింపు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న ఈ పనులను బువిస్ అనే యాప్‌లో పొందు పరచాల్సి ఉంటుంది. పని ప్రారంభానికి ముందు ఆ రోడ్డు పరిస్థితిని ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. జియో ట్యాగ్ చేయాల్సి ఉంది. అలాగే పనిచేసే సమయం, పూర్తైనా తర్వాతా ఫొటోలు విధిగా పెట్టాలి. ఆ వర్క్ ఐడీలో ఆ పనితీరును ఎక్కడైనా చూసుకొనేలా అవకాశం ఉంది. ఇది గమనించిన క్షేత్ర సహాయకులు క్షేత్ర స్థాయిలో చేపడుతున్న పలు పనులకు సంబంధించిన ఫొటోలను తొలగించారు. ప్రధానంగా పని ప్రారంభానికి ముందు ఫొటోలను నాయకులు ఒత్తిడితో డిలీట్ చేశారనే ఆరోపణలున్నాయి.



అయ్యప్పగారి పల్లెలో అనుమతి లేకుండా ఇంటి గుమ్మం వరకు వేసిన సీసీ రోడ్డు



వీఎస్‌పురం గ్రామంలో పాత దారి



తాళంబేడులో పంట పొలం మీద రహదారి



దిగవూరు వద్ద పొలంలోని ఇంటికి వేసిన రోడ్డు



తుమ్మింద కాలనీలో అధ్వానంగా దారి



మామిడి తోటలో గెస్ట్‌హౌస్‌కు వేసిన బాట



తాళంబేడులో పంట పొలాల కింద పాత రోడ్డు



వీఎస్‌పురంలో కొత్తరోడ్లు

పరీక్షలకు వేళాయె!

జిల్లాలో పది , ఇంటర్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఇది పరీక్షా సమయం. విద్యార్థులు తమలోని సత్తా చాటేలా సర్వం సన్నద్ధమయ్యేందుకు మార్చి, ఏప్రిల్ నెల అత్యంత కీలకం. విద్యార్థులు తమను తాము సమాయత్తం చేసుకోవడంతో పాటు పక్కా ప్రణాళికతో పది, ఇంటర్ పరీక్షలకు సన్నద్ధం కావడం ముఖ్యమని విద్యావేత్తలు చెబుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర విద్యాశాఖ అధికారులు పది, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ఖరారు అయింది. ఇంటర్ విద్యార్థుల హాల్‌టికెట్‌లు విడుదల కాగా, త్వరలో పదో తరగతి హాల్‌టికెట్‌లు రానున్నాయి. జిల్లాలో పది, ఇంటర్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

- ఇంటర్ పరీక్షలకు నాలుగు రోజులే..
- మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు 'పది' పరీక్షలు
- నిర్వహణపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి
- మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చర్యలు
- కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేసిన అధికారులు



ఇంటర్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : పరీక్షల సమయం సమీపించింది. సంవత్సర కాలం పాటు వ్యయ ప్రయాసల కోర్చి చదువుకున్న పది, ఇంటర్మీడియట్ విద్యార్థుల భవితవ్యం పబ్లిక్ పరీక్షలతో ముడిపడి ఉంది. కష్టపడి పరీక్షలకు సన్నద్ధం అయిన విద్యార్థుల భవితవ్యం తేల్చే ప్రత్యేక సమయం దగ్గర పడింది. పుస్తకాలతో కుస్తీ పట్టి మేధస్సును మదించి పొందిన విద్యను మార్కుల రూపంలో ప్రతిఫలం అందించే పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ పరీక్షల ప్రారంభానికి ఇక ఐదు రోజులే సమయం ఉంది. కాగా ఈ పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి 20 వ తేదీ వరకు, అదే విధంగా పదో తరగతి పరీక్షలు మార్చి 17వ తేదీ నుంచి ఏప్రిల్ 1 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ రెండు తరగతుల పరీక్షలు మార్చి నెలలోనే ప్రారంభం అవుతుండడంతో పాఠశాల, కళాశాల విద్యాశాఖ అధికారులు ముందస్తు ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు.

కలెక్టర్ ప్రత్యేక ఫోకస్..

జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానున్న పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ఇప్పటికే పలుమార్లు పది, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించి ఏర్పాట్లపై ఆరా తీశారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు కేంద్రాల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా పలు శాఖల అధికారులకు పకడ్బందీ సూచనలు జారీచేశారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు ఇలా.......

జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలకు 30,652 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

పదో తరగతి పరీక్షలకు ఇలా......

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 118 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పకడ్బందీగా మౌలిక వసతులు చేపడుతున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

పది, ఇంటర్ పరీక్షల జిల్లా సమాచారం

ఇంటర్ పరీక్షల తేదీలు :	మార్చి 1 నుంచి 20 వరకు
'పది' పరీక్షల తేదీలు :	మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు
ఇంటర్ పరీక్షకు హాజరుకానున్న మొదటి సంవత్సరం విద్యార్థులు :	15,482
ఇంటర్ పరీక్షకు హాజరుకానున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులు :	15,170
పదో తరగతి పరీక్షకు హాజరుకానున్న విద్యార్థులు :	21,248
ఇంటర్ పరీక్ష కేంద్రాలు :	50
పదో తరగతి పరీక్ష కేంద్రాలు :	118

పరీక్షలకు భయపడాల్సిన అవసరం లేదు..



ఇంటర్, పదో తరగతి విద్యార్థులు భయాందోళన చెందకుండా పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. పాఠశాల, కళాశాల స్థాయిలో మాదిరిగానే పబ్లిక్ పరీక్షలు కూడా ఎలాంటి ఇబ్బంది పడకుండా రాయాలి. పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి.

– సుమిత్‌కుమార్ గాంధీ, కలెక్టర్, చిత్తూరు

టీవీ, సెల్‌కు దూరంగా ఉండాలి



విద్యార్థులు పరీక్షల కాలంలో ముఖ్యంగా టీవీలు, సెల్‌ఫోన్ వాడకానికి దూరంగా ఉండాలి. గంట చదివిన తరువాత కొంత విరామం తీసుకోవడం అవసరం. సమూహంగా కూర్చొని, చదివిన విషయాన్ని చర్చించడం వల్ల ఎక్కువ ఫలితం ఉంటుంది. ఉదయం కొద్దిసేపు ప్రాణాయామం, ధ్యానం చేయండి. – సయ్యద్‌మౌలా, ఇంటర్మీడియట్ డీవీఈవో, చిత్తూరు

అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం



జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ముమ్మరంగా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాం. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు చేపడుతున్నాం. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించే సామర్థ్యం ఉన్న అధికారులను విధులకు కేటాయిస్తున్నాం.

– వరలక్ష్మి, డీఈవో, చిత్తూరు

తాటిమాకులపల్లెలో కషాయాల విక్రయ కేంద్రం

చిత్తూరు రూరల్(కాణిపాకం): మండలంలోని తాటిమాకులపల్లెలో సోమవారం ప్రకృతి వ్యవసాయ సంబంధిత కషాయాల విక్రయ కేంద్రం ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయ వనరుల సేవ కేంద్రం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు మాట్లాడుతూ సేంద్రియ సాగుపై రైతులు దృష్టిసారించి పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవాలని సూచించారు. భూసారం పెంచేందుకు కషాయాలు ఉపయోగపడతాయని వెల్లడించారు. కార్యక్రమంలో అధికారులు గురు ప్రసాద్, సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీసు గ్రీవెన్స్‌కు 36 ఫిర్యాదులు


సమస్యలు వింటున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఏఆర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 36 వినతులు అందాయి. ఈ మేరకు ఎస్పీ మణికంఠ అర్జీలు స్వీకరించారు. పలు ఫిర్యాదులపై అప్పటికప్పుడే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా స్టేషన్ హౌజ్ అధికారులతో మాట్లాడారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలపై విచారణ చేపట్టి, ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ సైతం ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

సిలిండర్లను అధిక ధరకు అమ్మితే చర్యలు


మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్లను అసలు ధర కంటే ఎక్కువ రేటుకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ విద్యాధరి హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్లు అధిక ధరలకు అమ్ముతున్నట్లు ఫిర్యాదులు వస్తు న్నాయన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకంటే ఎక్కువ మొత్తం వసూలు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు సిలిండర్ డెలివరీ బాయ్‌లకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. వసూళ్లకు పాల్పడే సిబ్బందిని గుర్తించి ఉద్యోగం నుంచి తొలగించాలని ఆదేశించారు. జిల్లాలో ఫిర్యాదులు అందిన ఏజెన్సీలకు నోటీసులు ఇచ్చామన్నారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శంకరన్ పాల్గొన్నారు.

- కలెక్టరేట్‌లో గ్రీవెన్స్‌కు 220 అర్జీలు
- స్వీకరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

వివిధ సమస్యలు.. వందల వినతులు

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జీలు వెల్లువెత్తాయి. వివిధ సమస్యలపై పలు మార్లు వినతులు సమర్పిస్తున్నా.. క్షేత్రస్థాయి అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని అర్జీదారులు వాపోయారు. ఈమేరకు అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ, జేసీ విద్యాధరికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో ప్రజలు అందించిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్ఓ మోహన్‌కుమార్ పాల్గొన్నారు. గ్రీవెన్స్‌కు మొత్తం 220 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ తెలిపారు.

దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారు

దౌర్జన్యంగా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని వెదురుకుప్పం మండలం గ్యారంపల్లె, రామకృష్ణాపురానికి చెందిన మహిళలు వాపోయారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మహిళలు మాట్లాడుతూ తమ గ్రామంలో సర్వే నంబర్ 125/2లో 4.33 ఎకరాల ప్రభుత్వ భూమిని గిరిరాజు అనే వ్యక్తి కబ్జా చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నట్లు మండిపడ్డారు. అలాగే గ్యారంపల్లెలో కుంటను సైతం గిరిరాజు ఆక్రమించుకున్నాడని వివరించారు. తహసీల్దార్ రమేష్, సర్వేయర్ రాకేష్, వీఆర్ఓ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు.



అటవీశాఖతో ఇబ్బందులు



అటవీశాఖ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని తవణంపల్లె మండలం కృష్ణాపురం ఎస్టీ కాలనీకి చెందిన మురళి, జ్యోతి, అంజమ్మ వాపోయారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ కాలనీలో 30 యానాదుల కుటుంబాలున్నట్లు చెప్పారు. తమ పూర్వీకుల నుంచి అక్కడున్న భూముల్లో సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అటవీశాఖ అధికారులు వచ్చి అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. వ్యవసాయం తప్ప వేరే జీవనాధారం లేదని, అధికారులు న్యాయం చేయాలని కోరారు.

కేసులు పెడుతున్నారు



అగ్రకులాలకు చెందిన వారు తమపై దౌర్జన్యం చేస్తున్నారని, పైగా కేసులు పెట్టించి వేధిస్తున్నారని చౌడేపల్లె మండలం దిగువపల్లె, మొట్లపల్లెకు చెందిన యానాదులు వరలక్ష్మి, శారద ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ దిగువపల్లె రెవెన్యూ సర్వే నంబర్లు 193/5, 193/6 లో 7 ఎకరాల డీకేటీ భూమి ఉందన్నారు. ఆ భూమిని చదును చేసుకుని వ్యవసాయం చేసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల అగ్రకులాలకు చెందిన వారు వచ్చి తమపై కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

బెదిరిస్తున్నారు



తమ గుడిసెలను కూల్చేస్తామని తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి భయాందోళనలు సృష్టిస్తున్నట్లు గుడిపాల మండలం కృష్ణాపురం ఎస్టీకాలనీ వాసులు పట్టాభి, వినోద్ తెలిపారు. దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ తమ కాలనీలో 30 కుటుంబాలు నివసిస్తున్నట్లు చెప్పారు. అందులో 10 కుటుంబాలు గుడిసెల్లోనే ఉంటున్నాయన్నారు. ఇటీవల తమిళనాడుకు చెందిన వ్యక్తి వచ్చి ఆ భూమి తనదని, ఖాళీ చేయకుంటే గుడిసెలను కూల్చేస్తామని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు.

‘జీబీ సిండ్రోమ్’ కలకలం

- తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న రోగులు

కాణిపాకం/తిరుపతి తుడా : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో జీబీ సిండ్రోమ్ కలకలం రేపుతోంది. బీసీజీ లక్షణాలతో ఈనెలలోనే 17 మంది తిరుపతిలోని స్విమ్స్‌లో చేరారు. అందులో ఐదుగురు డిశ్చార్జ్ కాగా 12 మంది చికిత్స పొందుతున్నారు. వీరిలో 8 మంది వివిధ జిల్లాల వాసులైతే మిగిలిన నలుగురు చిత్తూరు, తిరుపతి జిల్లాలకు చెందిన వారు. ఈ క్రమంలో పలమనేరు గొబ్బిలకోటూరుకు చెందిన వరలక్ష్మి, గంగవరం మండలం మర్రిమాకులపల్లెకు చెందిన చంద్రప్ప, తిరుపతి జిల్లా భాకరాపేటకు చెందిన రామమూర్తి, చంద్రగిరి రాయలపురానికి చెందిన ప్రసాద్ ప్రస్తుతం స్విమ్స్‌లో చికిత్స తీసుకుంటున్నారు. న్యూరాలజీ నిపుణులు ప్రత్యేక శ్రద్ధతో వీరికి వైద్యసేవలందిస్తున్నారు. ఈ మేరకు ఖరీదైన ఇంజక్షన్లను ఇస్తున్నట్లు న్యూరాలజీ వైద్యులు వెల్లడించారు. అయితే వైద్యం ఖరీదుతో కూడినదైనా వ్యాధికి భయపడాల్సిన అవసరంలేదని వివరిస్తున్నారు. లక్షణాలు గుర్తించిన వెంటనే ఆస్పత్రికి రావాల్సిందిగా సూచిస్తున్నారు. చికిత్స తీసుకుంటున్న వారి పరిస్థితి నిలకడగా ఉందని స్పష్టం చేస్తున్నారు.

వ్యాధి వ్యాప్తి ఇలా..

వయసుతో సంబంధం లేకుండా.. ఆడ, మగ తేడా లేకుండా జీబీ సిండ్రోమ్ సోకుతుంది. ఇది అంటు వ్యాధి కాదు. 25 శాతం మందికి ఈ వ్యాధి సోకడానికి కారణాలు కూడా తెలియదు. 20 శాతం మందికి దగ్గు, జలుబు వంటి వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల వస్తోంది. గ్యాస్ట్రో ఎంట్రైటీస్ (జీఈ) ఇన్ఫెక్షన్, డయేరియా వల్ల కూడా వస్తోంది. కాళ్లు, చేతులు చచ్చుబడిపోవడం వ్యాధి సోకిన వారిలో కనిపించే ప్రధాన లక్షణం. ఇది నరాలపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. తొలుత కాళ్లకు సోకి తర్వాత శరీరంపై భాగానికి ఎగబాకుతుంది. వ్యాధి నుంచి కొంత మంది గంటల వ్యవధిలోనే కోలుకోవచ్చు. మరి కొంత మందికి నెలల సమయం పడుతుంది. జ్వరం, విరేచనాలు, దగ్గు, జలుబు వచ్చి తగ్గుతున్న సమయంలో తిమ్మిర్లు ప్రారంభమై కాళ్లు బలహీనపడితే జీబీ సిండ్రోమ్‌గా గుర్తించాలి. తక్షణమే చికిత్స కోసం న్యూరాలజిస్టులను సంప్రదించాలి.

నిబద్ధతకు ప్రతిఫలమే ‘నాక్ ఏ గ్రేడ్’


ప్రిన్సిపల్‌ను సత్కరిస్తున్న నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రిన్సిపల్, అధ్యాపకుల నిబద్ధతకు ప్రతిఫలంగా పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ లభించిందని స్మార్ట్‌సిటీ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ నేతలు, పూర్వ విద్యార్థులు సత్య, శివకుమార్ తెలిపారు. సోమవారం ఈ మేరకు పీవీకేఎన్ ప్రిన్సిపల్ జీవనజ్యోతిని ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన పీవీకేఎన్ కు నాక్ ఏ గ్రేడ్ రావడం ఆనందంగా ఉందన్నారు. ఈ క్రమంలోనే నగర ప్రముఖులు పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల అభివృద్ధి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ నాయకులు అశోక్‌కుమార్, అట్లూరి శ్రీనివాసులు, మల్లికార్జునరావు, శ్రీనివాసమూర్తి, అధ్యాపకులు మీరాసాహెబ్, భానుప్రకాష్, గోపీనాయక్ పాల్గొన్నారు.

పరీక్ష ఫీజుతో ఉద్యోగి పరార్

- హాల్ టికెట్లు ఇవ్వని కళాశాల యాజమాన్యం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు కళాశాల యాజమాన్యం ఇంటర్ విద్యార్థులకు చుక్కలు చూపిస్తోంది. కొంగారెడ్డిపల్లెలోని ఈ కళాశాలలో విద్యార్థుల నుంచి ఫీజులు కట్టించుకునే ఉద్యోగి గత పది రోజులుగా విధులకు హాజరుకావడం లేదు. ఏమైందని ఆరా తీస్తే, ఆమె ఉద్యోగం మానేసినట్లు తెలిసింది. అయితే ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు హాల్ టికెట్లు తీసుకునేందుకు కళాశాలకు వెళితే డబ్బులు కట్టాలని చెబుతున్నారు. తాము మొత్తం నగదు చెల్లించేశామని విద్యార్థులు చెబుతున్నా, యాజమాన్యం పట్టించుకోవడలేదు. డబ్బులు కట్టించుకున్న ఉద్యోగి ఎక్కడికో వెళ్లిపోయిందని.. తమకు కట్టాల్సిన మొత్తం పిల్లలు చెల్లించాల్సిందేనంటూ తెగేసి చెబుతోంది. సోమవారం పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కళాశాలకు వచ్చి హాల్‌టికెట్లు అడిగినా ప్రయోజనం లేకుండా పోయింది. ఉద్యోగి డబ్బులు వాడేసుకుని ఉంటే, పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన నిర్వాహకులు.. పిల్లలపై ఒత్తిడి పెంచుతున్నారు. దీనిపై ఇంటర్ బోర్డు అధికారులు స్పందించి విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇప్పించాలని.. కళాశాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

కుప్పంరూరల్ : మండలంలోని మల్లానూరులో ఆదివారం నిర్వహించిన జల్లికట్టులో గాయపడిన యువకుడు చికిత్సపొందుతూ మృతి చెందాడు. వివరాలు.. ఎడ్లపందేల్లో పాల్గొనేందుకు అడవిబూదుగూరుకు చెందిన కరుణాకరన్ (26) మల్లానూరు వచ్చాడు. ఎడ్లను నిలువరించే క్రమంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్నేహితులు, కుటుంబీకులు వెంటనే కరుణాకరన్‌ను కుప్పం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు వేలూరు సీఎంసీకి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం వేకువ జామున కరుణాకరన్ మరణించాడు. దీంతో అడవిబూదుగూరులో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..


వెంకట్రమణారెడ్డి మృతదేహం

పుంగనూరు : పట్టణంలోని భగత్‌సింగ్ కాలనీ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. వివరాలు.. చౌడేపల్లె మండలం అగస్తిగానిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి (45), పుంగనూరు మండలం కంగానెల్లూరుకు చెందిన మాధవ(40) ద్విచక్రవాహనంలో వస్తుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరమణారెడ్డి అక్కడికక్కడే మరణించాడు. మాధవ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానిక ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.38 లక్షలకు ఐపీ

పలమనేరు : గంగవరం మండలం కొంగోళ్లపల్లెకు చెందిన ప్రమీల అనే మహిళ తాను ఆర్థికంగా నష్టపోయానని, అప్పులు తీసుకున్నవారికి తిరిగి డబ్బులు చెల్లించలేనంటూ ఐపీ పిటిషన్‌ను పలమనేరు కోర్టులో దాఖలు చేశారు. వివరాలు.. చీరల వ్యాపారం చేసేవాళ్లమని, కోవిడ్ కారణంగా ఆర్థికంగా దెబ్బతిన్నామని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఐపీ నం:2/2025 పేరిట కేసు పెట్టారు. తనకు రూ.38లక్షలు అప్పు ఇచ్చిన వెంకటేష్ రెడ్డి, పూరి, కృష్ణమ్మ, లలిత, సుజాత, రెడ్డమ్మ, పార్వతమ్మ, మోహన్‌రెడ్డి, నంద, ఈశ్వర్‌గౌడ, నవనీత, సురేష్, కృష్ణమాచారి, నటరాజారెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, శంకరాచారి, సురేష్ రెడ్డి, సుధారాణి, వంశీ, చిలకమ్మకు నగదు చెల్లించలేనని ఐపీలో పేర్కొన్నారు. ప్రస్తుతం తన వద్ద రెండు చీరలు, రెండు బ్లౌజులు, రెండు లంగాలు మాత్రమే ఉన్నాయని వాటి విలువ రూ.2వేలు మాత్రమేనని తన పిటిషన్‌లో తెలిపారు. దీనిపై విచారించిన జడ్జి శ్యామలమ్మ సదరు వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. దీంతో నోటీసులందుకున్న వారు లబో దిబో మంటున్నారు.

అర్బన్ ఆర్ఐ సరెండర్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని అర్బన్ మండల రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న ఆర్ఐ సంతోష్‌ను కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి సరెండర్ చేశారు. ఓ భూ తగదాల విషయంలో సెటిల్‌మెంట్ చేసినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడం..ఆ తర్వాత పూర్తి స్థాయిలో విచారణ చేసి సరెండర్‌కు పూనుకున్నట్లు తెలిసింది.

పోస్టాఫీసులో చోరీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరం మార్కెట్ చౌక్‌లోని తపాలశాఖ కార్యాలయంలో చోరీ జరిగింది. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు.. ఈనెల 22వతేది సాయంత్రం పోస్టాఫీసు పనివేళలు ముగియడంతో తాళం వేసిన సిబ్బంది ఇంటికి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం ఆఫీసు తెరవడానికి రాగా తలుపులు పగలగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూసిన సిబ్బంది రూ. 63వేలు చోరీ జరిగినట్లు గుర్తించారు. సబ్ పోస్టాఫీసర్ వినోద్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ జయరామయ్య తెలిపారు.

సభా స్థలం పరిశీలన


స్థల పరిశీలనలో కలెక్టర్ సుమిత్‌కుమార్

గంగాధరనెల్లూరు : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గంగాధరనెల్లూరులో చేపట్టే పింఛన్ల పంపిణీకి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సభా స్థలం కోసం సోమవారం ఈ మేరకు కలెక్టర్ సుమిత్‌కుమార్ మండల కేంద్రంలో పర్యటించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానాన్ని ఎంపిక చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సీఈఓ రవికుమార్, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

చెరువులో దూకి వివాహిత ఆత్మహత్య

పలమనేరు : మండలంలోని బోడిరెడ్డిపల్లెకు చెందిన జగన్నాథం భార్య కోమల (36) సోమవారం జల్లిపేట చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. భార్యభర్తల మధ్య గొడవ జరగడంతో కోమల మనస్తాపం చెంది చెరువులో దూకేసింది. అగ్నిమాపక సిబ్బంది గ్రామానికెళ్లి ఆమె మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రైసైకిళ్ల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్ : పారా స్పోర్ట్స్ క్రీడాకారులకు (విభిన్నప్రతిభావంతులు) సోమవారం కలెక్టరేట్‌లో ట్రై సైకిళ్లను జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ పంపిణీ చేశారు. జేసీ మాట్లాడుతూ విభిన్నప్రతిభావంతులు కుంగిపోకుండా, మనోధైర్యంతో ముందుకు సాగాలని కోరారు.

వైభవం.. ధ్వజారోహణం


ధ్వజపటాన్ని ఎగురవేస్తున్న అర్చకులు

బంగారుపాళెం : మొగిలీశ్వరుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం వైభవంగా ధ్వజా రోహణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం కామాక్షి సమేత మొగిలీశ్వరస్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం కలశ స్థాపన చేపట్టారు. అనంతరం ధ్వజస్తంభానికి ప్రోక్షణ జరిపించారు. ఉత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజపటం ఎరుగవేశారు. కార్యక్రమానికి బంగారుపాళ్యానికి చెందిన గోమతి స్పిన్నింగ్‌మిల్లు యాజమాన్యం ఉభయకర్తగా వ్యవహరించింది. ప్రధాన అర్చకుడు రెడ్డప్పగురుకుల్, అర్చకులు విశ్వనాథ గురుకుల్, హరికేష్ గురుకుల్, మంజునాథ్ గురుకుల్, పవన్ గురుకుల్, సోమశేఖర్ గురుకుల్, దండపాణి గురుకుల్, మురళీ గురుకుల్ పాల్గొన్నారు.

హంస వాహనంపై ఆదిదంపతులు

బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి ఆదిదంపతులు హంస వాహనంపై కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. స్వామి, అమ్మవార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వాహన సేవకు మండల కరుణీగర్ సంక్షేమ సంఘం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మునిరాజ, వంశపారంపర్య ధర్మకర్త విజయ కుమార్ పాల్గొన్నారు.

నేడు అధికార నంది, సింహ వాహన సేవలు

మొగిలీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం అధికార నంది వాహనం, రాత్రి సింహవాహన సేవ నిర్వహించనున్నారు.

బోరు స్టార్టర్ చోరీ

పెద్దపంజాణి : మండలంలోని శంకర్రాయలపేట గ్రామానికి చెందిన ప్రభుత్వ రక్షిత మంచినీటి సరఫరా బోరు మోటార్ స్టార్టర్ ఆదివారం రాత్రి చోరీకి గురైందని సర్పంచ్ హరనాథ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పంపు రూము తాళాలను దుండగులు పగులగొట్టి స్టార్టర్‌ను అపహరించినట్లు వెల్లడించారు. ఇప్పటికే పలు మార్లు కేబుల్ వైర్లు, స్టార్టర్లు చోరీకి గురైనట్లు వివరించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బోయకొండ హుండీ లెక్కింపు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు చేపట్టారు. 44 రోజులకు గాను అమ్మవారికి కానుకల రూపంలో రూ.59.31 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. అలాగే 51 గ్రాముల బంగారం, 540 గ్రాముల వెండి, 6 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు వివరించారు.

పీఎం కిసాన్ నగదు జమ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలోని 1.78 లక్షల మంది రైతులకు సోమవారం పీఎం కిసాన్ నగదును జమ చేసినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు రైతుల బ్యాంకు ఖాతాలకు రూ. 35.56కోట్ల నగదు జమైనట్లు వివరించారు. నగదు రాకుంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

శాంతిపురం : పొట్ట కూటి కోసం కొబ్బరి బొండాలు దింపేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడ్డి ప్రాణాలు కోల్పోయాడు. వివరాలు.. కెనమాకులపల్లె పంచాయతీ గడ్డూరు గ్రామానికి చెందిన ఈ.నాగరాజు(42) ఓ వ్యాపారి వద్ద కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం రాష్ట్ర సరిహద్దుల్లోని కర్ణాటకలో ఉన్న అగ్రహారం గ్రామంలో కొబ్బరి బొండాలు దింపేందుకు వెళ్లాడు. పొరబాటున చెట్టుపై నుంచి జారి పడి మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసిన క్యాసంబళ్లి పోలీసులు కేజీఎఫ్ సివిల్ హాస్పిటల్‌లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఐదేళ్ల కుమారుడు, మూడేళ్ల కుమార్తె ఉన్నారు.

28లోపు లైఫ్ సర్టిఫికెట్ అందించాలి


రామచంద్ర, ఖజానా శాఖ డీడీ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పెన్షనర్లు ఈ నెల 28వ తేదీ లోపు కచ్చితంగా లైఫ్ సర్టిఫికెట్ అందించాలని జిల్లా ఖజానా శాఖ డీడీ రామచంద్ర తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 13,863 మంది పెన్షనర్లు ఉండగా, ఇప్పటి వరకు 10,793 మంది మాత్రమే సర్టిఫికెట్‌లు సమర్పించారని వెల్లడించారు. గడువులోపు లైఫ్ సర్టిఫికెట్ అందించకుంటే పెన్షన్ రాదని వివరించారు.

రావణబ్రహ్మపై.. శివయ్య రాజసం


రావణ, మయూర వాహనాలపై ఆదిదంపతులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం రాత్రి శ్రీకాళహస్తీశ్వరుడు రావణ వాహనంపై అధిరోహించి పురవిహారం చేశారు. ఆయన పక్కనే దేవేరి జ్ఞానప్రసూనాంబ అమ్మవారు మయూర వాహనంపై స్వామివారిని అనుసరించారు. అంతకుముందు ఆలయ అలంకార మంపడం, యాగశాలలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సమూర్తులను ఆలయ నుంచి రాజగోపురం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ స్వామి వారిని రావణ వాహనంపై, అమ్మవారిని మయూర వాహనంపై, వినాయకుడు మూషిక వాహనం, శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరస్వామి, భక్తకన్నప్ప చప్పరాలపై స్వామి, అమ్మవార్ల వెంట సాగారు.

హంస, యాళి వాహనాలపై పురవిహారం

సోమవారం ఉదయం శ్రీకాళహస్తీశ్వరుడు బంగారు హంస, జ్ఞానప్రసూనాంబ అమ్మవారు బంగారు యాళి వాహనాలపై పురవీధుల్లో విహరిస్తూ కనువిందు చేశారు. మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై శ్రీవల్లీ, దేవసే సమేత కుమారస్వామి, చండికేశ్వరుడు, భక్త కన్నప్ప కొలవుదీరారు. కళాకారుల కోలాటాల నడుమ, శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి.

నేడు శేష, యాళి వాహనసేవలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రాత్రి శివపార్వతులు బంగారు శేష, యాళి వాహనాలపై పురవీధుల్లో ఊరేగనున్నారు. ఉదయం బంగారు హంస, చిలుక వాహనాలపై విహరించనున్నారు.

నేడు నాగరాత్రి

శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రాత్రిని నాగరాత్రిగా వ్యవహరిస్తారు.